# బారిష్టరు గారి బాత్రాఖాని

మొక్కపాటి నరసింహశాస్త్రి

భూషలు గావు మర్త్యులకు
  భూరిమయాంగద తారహారముల్
భూషిత కేశపాశమృదు
  పుష్పసుగంధ జలాభిషేకముల్
భూషలు గావు పూరుషుని
  భూషితు చేయు పవిత్రవాణి వా
గ్భూషణమే సుభూషణము
  భూషణముల్ నశియించు నన్ని
        యున్॥

విద్య నిగూఢ గుప్తమగు
  విత్తము రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి
  విద్య గురుండు విదేశ బంధుడున్
విద్య విశిష్ట దైవతము
  విద్యకు సాటి ధనంబు లేదిలన్
విద్య నృపాలపూజితము
  విద్య నెరుంగనివాడు మర్త్యుడే॥

............................

బలే! ఎంత బాగా అన్నాడండి మహాను భావుడు. విన్నారా గురుదేవ్! అన్నాడు భద్రం. నేను వినిపించుకోలేదు. ఏదో పరధ్యానంలో ఉన్నాను. ఏదో ఏమిటి! వర్తమాన పరిస్థితులను గురించే తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ఈ ఎన్నికలూ గొడవా చాలా ఆందోళన కరంగా ఉంది నాకు. కావడం, నేను ఏ స్థానానికీ పోటీ చెయ్యడంలేదు. చెయ్యాలనే సంకల్పమూ లేదు. నేను ఏ పార్టీలోనూ సభ్యుడనూ కాను. మరైతే నీ కెందుకయ్యా, అంత బాధ అంటారేమో! అదే నాకున్న జబ్బు. నాకు స్వంత సమస్య లేమీ లేవు. ఉన్నా నన్ను అట్టే బాధించనూ బాధించవు. సృష్టిలో నే నెంత, నా సమస్యలెంత! నా బాధలెంత! కాని సంఘం, దేశం, అయోమయస్థితిలో పడి, అధ్వాన్నమవుతుంటే చూస్తూ ఊరుకోలేను. అంతులేని ఆవేదన పడతాను. అర్థంలేని ఆలోచనలలో మునిగి తేలుతూ ఉంటాను. దేశోద్ధరణ కనేకమార్గాలు అన్వేషిస్తూ ఉంటాను. అవన్నీ ఆచరణలోకి వస్తాయా అంటే అది వేరే సంగతి. రానూ వచ్చు. రాకపోనూ వచ్చు. ఊరికే నా స్వభావం చెప్పాను. నేనే అన్నమాటేమిటి. అందరూ అంతేననుకుంటాను.

ఇలా వినువీధిని విరవిహారం చేస్తున్న నాకు సామాన్య విషయాలు ఎలా చెవికెక్కుతాయి. భద్రం మాటలు నాకేమీ వినపడలేదు. ఒకవేళ చెవినిపడ్డా తలకెక్కలేదు.

'విన్నారా గురుదేవ్' అన్నాడు మళ్లీని.

'వెధవ సొద కట్టిపెట్టవోయి కాస్సేపు. గురువుగారు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నారు' అన్నాడు రామం.

'కొంపతీసి, ఎన్నికల ప్రచార కోలాహలంలోకి అమాంతం మీరు కూడా దూకతలుచుకున్నారా ఏమిటి బాబూ' అన్నాడు శర్మ.

'ఎంతమాట. వారలాటి పనులు ఎన్నడూ చెయ్యరు. ఊళ్లో వాళ్ళు దంపుతుంటే వారూరికే బుజాలు ఎగరేస్తారు' అన్నాడు శాస్త్రి.

'ఆ మాటకొస్తే, వారు బుజాలూ ఎగరెయ్యరు. కనుబొమలు మాత్రమే ఎగరేసి ఊరుకుంటారు' అన్నాడు శర్మ.

'తగురు అది చెయ్యరుకదా' అన్నాడు భద్రం.

'అసలు లేనిదే ఏది ఎగరేసి ఏం ప్రయోజనం బుజాలు కాని కనుబొమలు కాని' అన్నాడు శాస్త్రి.

'గురుదూషణ చాలా దూష్యం నేవా' అన్నాడు రామం.

'విద్యాధికు డెవ్వడూ చెయ్యడు. ఇంకొకడు చేస్తే సహించడు' అన్నాడు టప్పయ్య ఆవేశంతో.

నా కిదంతా ఏదో బాక్‌గ్రౌండ్ సంభాషణలా వినపడి 'ఏమిటి టప్పయ్యా' అన్నాను.

'మరేంలేదు గురుదేవ్. ఆ భర్తృహరి పద్యం జ్ఞాపకం వచ్చింది. 'భూషలు కావు మర్త్యులకు, భూరిమయాంగద' అనేది. నాకు చాలా అద్భుతంగా ఉన్నదనిపించింది. మీ అభిప్రాయమేమిటి అన్నాను' అన్నాడు భద్రం.

'ఇందులో అభిప్రాయాని కేముందోయి. నీ అభిప్రాయం, నా అభిప్రాయం, కోర్టువారి అభిప్రాయం, అంతా ఒకటే. అభిప్రాయ భేదాలకు ఆస్కారమేముంది ఇందులో. ఆ విషయంలో అభిప్రాయ భేదమే ఉంటే వాడొట్టి విద్యాగంధం లేనివాడన్నమాట. 'విద్యా విహీనః పశుః' అని మనవాళ్ళు అననే అన్నారు. అంతేనా బారిష్టరుగారూ' అన్నాడు శాస్త్రి.

'సందేహమేమి. ఎటొచ్చీ ఏవిద్య అనేదే ప్రశ్న. ఏ విద్యలేనివాడు పశుప్రాయుడు కింద లెక్క కట్టడం అనేది ప్రశ్న' అన్నాను.

'ఏ విద్యలేకపోయినా పశుతుల్యుడేను' అన్నాడు శర్మ.

'ఆ లెక్క ప్రకారం అంతా కూడా అంతో ఇంతో విద్యాధికులనే చెప్పాలి' అన్నాడు రామం.

'అలా ఎలా అవుతుంది' అన్నాడు భద్రం.

'ఏం. ఎందుకు కాదూ! దొమ్మరివాళ్ళ దొక విద్య, గారడీవాళ్ళ దింకో విద్య. బట్టలు నేసేవాళ్ళ దొక విద్య, వాటిని ఉతికి ఆరవేసేవాళ్ల దొక విద్య. ఇలాగే అన్ని వృత్తులకూ తలో విద్యా నేరుస్తేనే కాని ఆ వృత్తిలోవాళ్ళు ఉత్తీర్ణులు కాలేరుకదా' అన్నాడు శర్మ.

'అయితే మన విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యలలో ఉత్తీర్ణులై పట్టభద్రులయినవాళ్లకూ ఈ తక్కిన వృత్తిజీవనం చేసుకునేవాళ్లకూ ఏమీ తేడా లేదంటారా

ఏమిటి, కొంప తీసి' అన్నాడు టప్పయ్య కొంచెం ఉద్రేకంతో.

'యధార్థంచేతను ఏమీ లేదనే నా అభిప్రాయం' అన్నాడు శాస్త్రి.

'కొంచెం ఆలోచిస్తే శాస్త్రిగారు చెప్పింది సబబుగానే ఉన్నట్టుంది' అన్నాడు శర్మ.

'చంపారు. అంతే నంటారా గురుదేవ్' అన్నాడు భద్రం జాలిగా, తన సొమ్మేదో హఠాత్తుగా పోయినట్టు.

'మాట్లాడరేం గురువుగారూ, మా కాళ్లకింద భూమిఅంతా కరిగి మేం అఖాతంలో పడిపోతుంటేను' అన్నాడు రామం.

'శాస్త్రి చెప్పినది సబబేను' అన్నాను.

'చంపేశారు' అన్నారు రామం, భద్రం ఏకగ్రీవంగా.

'చంపడాని కేముంది. కాస్త ఆలోచించండి ప్రశాంతంగా మీరు కూడా. ఈ మన పట్టభద్రులుకంటె మామూలు కులవృత్తులు చేసుకునేవాళ్ళు ఏమితీసిపోయారు. ఎటొచ్చీ మన విద్య నేర్చుకోడానికి మనం పదేళ్లపాటు నానా యాతనలూపడి, మన తల్లిదండ్రులను అష్టకష్టాలాపెట్టి కొన్నివేలు ఖర్చుపెట్టించి ఒక పట్టా అనే దళసరి కాగితం సంపాదించాం. వాళ్ళు ఈ కాలయాపనా, ఈ వ్యయప్రయాసలూ అక్కర లేకుండా, ఇందుకై అప్పుచెయ్య నవసరం లేకుండా వాళ్ళ విద్యలో వాళ్లూ ప్రావీణ్యం సంపాదించారు. ఎటొచ్చీ వాళ్లు విద్యాధికుల మనుకోరు. మనమే విద్యాధికులమనే అహంకారం మనకు బోలెడంత. మనం అజ్ఞానులమనే జ్ఞానం వాళ్ళకున్నది కనుక, పెద్దవాళ్లులా వాళ్ల కంటికగపడే వాళ్లమాట వాళ్లు వింటారు. అందులోని సత్యాసత్యాలను తెలుసుకోడానికి ప్రయత్నిస్తారు. అందుచేత జీవితానికి ప్రధానమైన విషయాల్లో వాళ్లు విజ్ఞానంతోనే ప్రవర్తిస్తారు. మనకంటె తెలిసినవాళ్లు ఇంకొకరుండరని మన అహంభావం. అందుకని ఇంకొకళ్లు మనకు చెప్పడమూ మనము వినడమూనా అనే అహంకారం. అందుచేతను ఎదుటివాళ్ళు చెప్పినదానిలో నెరసు లేరడం, వాళ్ల నవహేళన చెయ్యడంతోనే సరిపోతుంది మన పని. సత్యాన్వేషణకు మనకు సావకాశముండదు. ఎప్పుడూ ఎండమావులులా అలా మనకు దూర దూరంగా పోతూనే ఉంటుంది. అందినట్టే కనిపించి, ఇట్టే చేతులోనుంచి చేపలా జారిపోతుంది. మనం విద్యాధికులమని ప్రతిక్షణం ప్రపంచానికి చాటడానికి మనం ప్రత్యేక వేషభాషల నవలంబించాము. మామూలు వాళ్ళు మామూలుగా సహజంగా కనుపిస్తారు. ఈ కృత్రిమ సాహాయ్యాలేమీ వాళ్ళ కవసరం ఉండవు. ఇంతా శ్రమపడి, ఇన్ని కష్టాలూ పడి, ఇన్ని వేలూ ఖర్చుచేసి సంపాదించిన విద్య దేనికయ్యా అంటే అదీ వృత్తికోసమే! ఉద్యోగం కోసమే! ఉదర నిమిత్తమే! ఎటొచ్చీ మామూలు వాళ్ళు వాళ్ళ విద్యచేతను రోజూ రూపాయో రెండో సంపాదించగలరు - ఇంట్లో కూచుని మనం ఏపూట ఉద్యోగం లేకపోతే ఆపూట వెచ్చగా కడుపులో కాళ్ళు పెట్టుకుపడుకో వలసిందే.

'అంతే?' - అన్నాడు రామం.

'పోనీ కాదని నువ్వు చెప్పచూద్దాం.





పండుకొనేప్పుడు "ఓవల్‌టిన్" అత్యుత్తమమైన పానీయము. పగలంతా కష్టపడిన తరువాత దీనిని తీసుకొంటే ఎంతో రుచిగాను హాయిగాను శమనకారిగాను వుంటుంది. మీరు నిద్రపోతున్నప్పుడు "ఓవల్‌టిన్"లో వున్న పోషక ద్రవ్యములు తిరిగి బలమును చేకూర్చి రేపటి పనులకు సంసిద్ధులుగా చేయును.

అందులో, పండిన బార్లీ మాల్టు సారము, శుద్ధమైన మీగడ ఆవుపాలు, ప్రత్యేకంగా తయారు చేయబడిన కోకో, ప్రకృతి సిద్ధమైన ఫాస్ఫైట్లు, విటమినులు చేరి ఉన్నవి ఆదనంగా బి. డి విటమినులుగూడ చేర్చబడినవి.

మీ స్టోరులో "ఓవల్‌టిన్" అడగండి దానితో సమానమైనది లేదు.

డిస్ట్రిబ్యూటర్లు: గ్రాహామ్సు ట్రేడింగ్ కంపెనీ
(ఇండియా) లిమిటెడ్.

# ఓవల్‌టిన్

రుచిగాను శమనకారిగాను ఉండును.




సిలోన్ రేడియోమీద శనివారాలు రా. 8 నుండి 8-30 గం.ల వరకు 'ఓవల్‌టిన్' ఎమెచూర్ కార్యక్రమం వినండి (హిందీ-41.72 మీటర్లు)

IV. 448.

# ★ బారిష్టరుగారి బాతాఖానీ ★

కునం పేంటు, బుష్‌కోటూ వేసి కలం పట్టుకుని కుర్చీమీద కూచుంటామనా మనగొప్ప. ఓ కుర్రాడు 'కూలికీ జీతానికీ తేడా ఏమిటి నాన్నా' అని అడిగాడట. తండ్రి చెప్పిన సమాధానం ఏమిటో తెలుసా. 'మాసిపోయిన పంచకట్టి, చిరిగిన చొక్కా తొడుక్కుని, చేతులతో బాడీలోనో, మసిలోనో పనిచేసుకుని రోజూ రెండు రూపాయిలు తెచ్చుకునేదాన్ని కూలి అంటారు. సూటూ, బూటూ, వేసి టేబులుదగ్గర కుర్చీ వేసుకుని కూర్చుని నెలకు పాతికో ముప్ఫయ్యో సంపాదిస్తే దాన్ని జీతమంటారు. అంతకన్నా తేడా ఏంలేదు నాయనా' అన్నాడట. అంతేకాదు మరి. అంతకన్నా తేడా ఏమైనా ఉన్నదంటారా.

'నిజంలాగే ఉన్నది' అన్నారు అంతా ఏకగ్రీవంగా.

'నిజమేనయ్యా! ముమ్మాటికీ నిజం. మన విద్య పొట్టకూటికి కాకపోతే ఇంకెందుకు పనికొస్తుంది. ఆ మాటకొస్తే, గుమాస్తాగిరీకి తప్ప మరెందుకూ పనికిరాదని ఒప్పుకోక తప్పదు. మనలో మనమాట; మనం చదువుకున్నదేమిటి? మన పాఠశాలల్లో మనకు నేర్పేదీ మనం నేర్చుకునేదీ ఏమిటి. ఆ పాఠాలు ఏ ఉద్దేశంతో వ్రాసేవాళ్ళు రాస్తున్నారు? చెప్పేవాళ్లు చెపుతున్నారు? ఆవుపాఠం, మేకపాఠం, ముంగిలిపాఠం ఇవన్నీ మనం నేర్చుకోవాలా? మనకు ఉపాధ్యాయులు చెప్పాలా? ఈ ప్రకృతిపాఠాలన్నీ మనం ప్రతినిత్యం ప్రత్యక్షంగా చూస్తున్నవేకాదూ. ఆవునీ, గొర్రెనీ, కాకినీ ఎరగనివాళ్లు మనదేశంలో ఎంతమంది ఉన్నారు? విదేశాల్లో అయితే, నూటికి 80 మందివరకూ పట్నాలలో ఉంటారు కనుక, అక్కడ పట్నాలు, మనదేశంలోకి మల్లే పల్లెటూళ్లలా ఉండవు కనుక, పట్నవాసపు కుర్రవాళ్ళు, ఈ సామాన్య జంతువులను కూడా చూడనివాళ్ళు అనేకమంది ఉంటారు. వాళ్ళకి ప్రకృతిపాఠాలు అవసరమయ్యేవి. ఆపద్ధతే మనకి దిగుమతి అయింది. ఈ పాఠాలు గట్టిగా చెప్పాలనే ఆసక్తి ఉపాధ్యాయులకూ లేదు- నేర్చుకోవాలనే ఆసక్తి విద్యార్థులకూ లేదు. ఉన్నత పాఠశాలల్లోనూ అంతే. మన విజ్ఞానం, మన సంస్కృతి, మన సంప్రదాయాలనూ నేర్పే విద్య కాని పాఠాలు కాని కనుపించవు. ఇప్పుడింకా కొంచెం నయం. మునుపు మరీ అధ్వాన్నంగా ఉండేది. ప్రభవా, విభవా చెప్పగలవుట్రా అని ఒక కుర్రవాడిని అడుగుతే, ప్రభవలు శివరాత్రికి అప్పుడు చూచాను కానండి, విభవలు ఎప్పుడూ చూడలేదన్నాడట. తమ ముత్తాత పేరుకాని బంధువర్గంలోవాళ్లనుకాని తెలియనివాళ్లను చాలామంది విద్యార్థులను ఎరుగుదును. హైస్కూలు విద్యార్థులయితే హిందీతారలయొక్క, కాలేజీ విద్యార్థులయితే హాలీవుడ్డు తారలయొక్క పుట్టుపూర్వోత్తరాలు, వర్గత్రయాలు, రహస్య జీవితాలు అన్నీ పూసగుచ్చినట్లు, తడుముకోకుండా చెప్పగలవాళ్లను చాలామందిని చూచాను. గోదావరి ఎక్కడున్నదంటే యూరోపులో మిస్సోరీ అనే దేశానికి ఉత్తరంగా ఉన్నదనే పట్టభద్రులుకూడా లేకపోలేదు. ప్రతినిత్యమూ మనకు ప్రత్యక్షమయ్యే సమస్యలను సజావుగా సమర్థించుకుని, సవ్యంగా జీవయాత్ర సాగించుకోడానికీ విద్య ఎందుకుపకరిస్తుంది చెప్పండి.

ఈ నిరుపయోగమైన విద్యకుతోడు రాజకీయా లొకటి. రాజకీయ రాద్ధాంత సిద్ధాంతాలు మన కక్కరలేకపోయినా విద్యార్థులకు కావాలి. వర్ణవివక్షత మనం మానుకుందామన్నా విద్యార్థులు మరచిపోరు. రాజకీయాల్లో వాళ్లకు తిరగవలసిన అవసరముంటుంది కనుక పరీక్షలు మానెయ్యమనో, వాయిదా వెయ్యమనో ఆందోళన. ఫలానవారు పోయినప్పుడో పోబోయేటప్పుడో మేం అల్లరిచేసి రైళ్ళు బళ్లూ ఆపి ఆంధ్రరాష్ట్రం సాధించాం కనుక మమ్మల్ని పరీక్షలు చెయ్యకుండా కాలేజీకి పంపించాలనే అభ్యర్థన. రాజకీయ పక్షాలలోనూ, రాజకీయవాదులూ, నాయకులలోనూ ఎన్ని అవకతవకల, అన్యాయాలూ, అసహనాలూ, ద్వేషాలూ, ద్రోహాలూ ఉన్నాయో, అవన్నీ వారు వారు శక్త్యనుసారం విద్యార్థుల కుపదేశించి, వారి లేత మనసులనూ హృదయాలనూ కలుషితంచేసి, ఈ భావిపౌరులను, ఈ సంఘ నిర్మాతలనూ, ఈ జాతి రత్నాలనూ, గాజు కుప్పెలుగానూ చిళ్ళపెంకులుగానూ తయారుచేస్తున్నారు.

'మరిఅయితే, గురూజీ, భర్తృహరివ్రాసిన పద్యాల సారాంశం...' అన్నాడు భద్రం.

భర్తృహరి వ్రాసిన విద్యసంగతి వేరోయి. దానికీ దీనికీ ఏమీ సంబంధం లేదు. పూర్వులు వాళ్ల ఆదర్శమేమిటో మొదటనే నిర్ణయించుకున్నారు. ఆ ఆదర్శ మందుకోడానికేది మార్గమో తెలుసుకున్నారు. అందుకు సుగమమైన సోపానాలు నిర్మించారు. మేధాశక్తి, నిష్ఠ, నియమం, ధ్యానం, ఆస్తిక్యబుద్ధి ప్రతివాడికీ అందులో విద్యాధికుడు కాదలచినవాడికి అత్యవసరమని నిశ్చయించారు. అందు కవసరమైన పాఠాలూ బోధనాపద్ధతులూ ఏర్పాటు చేశారు. అక్కడినించి బ్రహ్మజ్ఞానంవరకూ అడుగడుక్కీ విద్యార్థి అర్హతలు తెలుసుకుంటూ గురువు శిష్యుడిని తయారుచేసేవాడు. ఈ అర్హత లేనివాళ్లకూ ఈ విద్య అనవసర మనుకున్నవాళ్లకూ ఇహంలో సుఖజీవనం చేయడానికి వీలుగానూ తండ్రి కొడుక్కి నేర్పడానికి వీలయినవి అనేక విద్యలూ వృత్తులూ ఏర్పాటుచేశారు. అందుకనే 'కలవిద్య లెన్ని నేర్చిన కులవిద్యకు సాటిరావు గువ్వలచెన్నా' అన్నారు.

ఆ బ్రహ్మవిద్య నేర్చుకున్నవాళ్లకే విద్య అలంకారము, సుఖకరం, భోగకరం, విశిష్ట దైవతం, విదేశబంధువూ అవుతుంది. వాళ్లకు సంతృప్తే కాని అసంతృప్తి ఉండదు. సుఖమే కాని దుఃఖముండదు. ఏకత్వమే కాని భిన్నత్వముండదు. సర్వమానవ సౌభ్రాత్రమే కాని స్వజాత్యభిమానం ఉండదు. అటువంటి విజ్ఞానాన్ని, జ్ఞానాన్ని ఇచ్చే విద్య నిజంగా నశింపులేని సుభూషణమే అవుతుంది. ★

---

ఒక చికాగో నటీమణి తన లాయరువద్దకి వెళ్ళి చెప్పింది:

"నేను విడాకులు పుచ్చుకో దలిచాను."

"దానికేం? నిక్షేపంగా పుచ్చుకోవలసిందే. అయితే లాంఛనప్రాయంగా ఫీజు పుచ్చుకుంటాను."

"ఎంత మీ ఫీజు?"

"ఎంత? అయిదువందల డాలర్లు."

"ఎందుకు? శుద్ధదండగ! వందఇస్తే మళ్లామనిషి ఆనవాలు లేకుండా చేస్తారు."

---


శ్రీమదాంధ్ర
మహాభారతము
ఉద్యోగపర్వము
వెల రూ. 1-0-0
ఆంధ్ర గ్రంథమాల,
మద్రాసు-1.